

కోతకు గురవుతున్న జలాశయం మట్టి ఆనకట్ట

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీశైలానికి తగ్గిన ఇన్‌ఫ్లో

శ్రీశైలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం జూరాల నుంచి 54,763 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,648 క్యూసెక్కులు మొత్తం 72,411 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 63,508 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తిస్థాయి నీటిమట్టం 884.40 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.4385 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,958 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,600 క్యూసెక్కులు మొత్తం 67,558 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

జీడీపీ గతేమిటి?

అసంపూర్తిగా ప్రాజెక్టు ఎత్తు పెంచే పనులు



- వర్షపు నీటికి కోతకు గురవుతున్న మట్టికట్ట
- నాణ్యత లోపంతో రాతి పరుపు నిర్మాణంలో ఊడిపోతున్న రాళ్లు
- అసంపూర్తిగా ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంచే పనులు
- బిల్లులు ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని పాలకులు, జలవనరుల శాఖ ఇంజనీర్లు

కర్నూలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె జలాశయం మట్టి కట్ట ఎత్తు పెంచే పనుల్లో నాణ్యత లోపించింది. మట్టికట్ట వర్షపు నీటికి కోతకు గురయింది. వర్షపు నీటి డ్రైన్లు కుంగిపోయాయి. జలాశయ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన రాతిపరుపు (స్టోన్ రిబిట్మెంట్) చెక్కు చెదరలేదుగాని .. తాజాగా నిర్మించిన రాతిపరుపు రాళ్లు ఏడాది తిరక్కుండానే ఊడిపోతున్నాయి. రాళ్ల సైజ్ తక్కువగా ఉండడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. రెండు క్రస్ట్ గేట్ల ఏర్పాటు చేయకపోవడంతో స్టాప్‌లాగ్ గేటు దిగువన భారీగా లీకేజీలు ఏర్పడుతున్నాయి. అసంపూర్తి పనులు కారణంగా ప్రస్తుత సామర్థ్యం 4.5 టీఎంసీలు కూడా నిలువ చేయలేని దైన్యపరిస్థితి ఉంది.

గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామం సమీపంలో హంద్రీ నదిపై 4.500 టీఎంసీలు నిల్వ సామర్థ్యంతో 1971లో గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) నిర్మించారు. 1987లో పూర్తయిన ఈ ప్రాజెక్టుకు అప్పట్లో రూ.2.63 కోట్లు ఖర్చు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జ్ఞాపకార్థం ఈ ప్రాజెక్టుకు సంజీవయ్య సాగర్‌గా నామకరణం చేశారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా గోనెగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ మండలాల పరిధిలోని 21 గ్రామాలకు 25,454 ఎకరాలు రబీ ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత జిల్లాలో ఇదే అతిపెద్ద జలాశయం. ఇక్కడి నుంచే డోన్, కృష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాలు ద్వారా డోన్ పట్టణం సహా వివిధ పల్లెలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణానికి కూడా నీటి సరఫరా చేయడానికి పైపులైన్ పనులు చేపట్టారు. రైతులకు సాగునీరు అందించే మధ్య తరహా ప్రాజెక్టు కాస్త నగరం, పట్టణాలు, వివిధ గ్రామాలకు తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంక్‌గా మార్చారని రైతులు ఆరోపిస్తున్నారు. సాగు, తాగునీటి అవసరాలు దృష్ట్యా గత వైసీపీ ప్రభుత్వం నీటి సామర్థ్యం 5.500 టీఎంసీల(అదనంగా ఒక టీఎంసీ)కు పెంచేందుకు రూ.57 కోట్లు మంజూరు చేశారు. అయితే.. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి.



క్రస్ట్ గేట్ ఏర్పాటు చేయకపోవడంతో స్టాప్‌లాగ్ గేట్ నుంచి లీక్ అవుతున్న నీరు

మిగతా 8లో..

డంప్ చేసి.. దర్జాగా అమ్మేస్తున్నారు

నంద్యాలలో జోరుగా ఇసుక వ్యాపారం

- టన్ను రూ.1500లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

నంద్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అందించటంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీనివల్ల భవన నిర్మాణదారులు ఇళ్లు కట్టుకోవటంలో ఇబ్బందులు పడ్డారు. ఆ రంగానికి సంబంధించిన కార్మికులు పనుల్లేక నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టింది. ఉచిత ఇసుకను అందించే ప్రక్రియను మొదలు పెట్టింది. లబ్ధిదారులకు మేలు చేకూర్చే పనిని కొంతమంది అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఉచిత ఇసుకను నంద్యాలలో డంప్ చేసి అవసరం ఉన్న వారికి టన్ను రూ.1500 లెక్కన అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



పద్మావతి నగర్‌లో ఇసుకను డంప్ చేసిన అక్రమార్కులు



నంద్యాల నడిబొడ్డున..

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఇసుక అవసరం ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని రవాణా చేసుకోవచ్చు. ఇసుక రీచ్ వద్ద టన్ను ఇసుకకు రూ.370 చెల్లించాలి. అక్కడ నుంచి తమ ప్రాంతాలకు తెచ్చుకునేందుకు అయ్యే రవాణా ఖర్చులను వినియోగదారులే భరించాల్సి ఉంటుంది. నంద్యాల ఇసుక రీచ్‌లు లేవు కాబట్టి, ఇసుక అవసరం ఉన్న వారు కర్నూలు, కడప, తాడిపత్రి, మైదుకూరు వంటి ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇసుక అవసరం ఉన్న వారికి కొంతమందికి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవటం వంటి వాటిపైన అవగాహన లేదు. దీనిని కొంతమంది అక్రమార్కులు డబ్బు సంపాదన మార్గంగా ఎంచుకున్నారు. ఆన్‌లైన్ బుక్ చేసుకుంటూ ఆయా రీచ్‌ల నుంచి తెచ్చుకుని నంద్యాలలో డంప్ చేస్తున్నారు. నంద్యాలలోని పద్మావతి నగర్, నూనెపల్లి, రైతునగరం, క్రాంతినగర్ వంటి ప్రాంతాల్లో అక్రమార్కులు ఇసుకు డంప్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి అవసరం ఉన్న వారికి అమ్ముకుంటున్నారు. టన్ను ఇసుకకు రూ.1500 లెక్కన ట్రాక్టర్ ఇసుకను రూ.4000 నుంచి రూ.4500 వరకు అమ్ముతున్నారు. ఈ లెక్కన ఒక్కో వినియోగదారుడిపైన టన్నుకు రూ.1100 పైనే భారం పడుతోంది. అక్రమార్కులు తమ జేబులు నింపే పనిని చక్కబెట్టుకుంటూ ప్రభుత్వ ఉచిత ఇసుకకు చిల్లు పెడుతున్నారు.

మిగతా 8లో..

కృష్ణమ్మ ఒడిలో సీ ప్లేన్

- తొలి దశలో బెజవాడ-శ్రీశైలానికి సర్వీసు
- ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలో వాటర్ డ్రోమ్ ఏర్పాటు

9

దీపావళికి మహాశక్తి

- ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం
- 31 నుంచి అమలుకు శ్రీకారం
- రేపటి నుంచే బుకింగ్



ఉల్లి కష్టాలు



- కర్నూలు మార్కెట్‌లో కొనుగోళ్ల జాప్యం
- రోజులకొద్దీ కల్లంలోనే తిండీ తిప్పలు
- గ్రేడింగ్‌లో తరుగుతున్న దిగుబడులు
- కునుకులేని ఉల్లి రైతులు
- తాడేపల్లిగూడేనికి తరలిస్తున్న వైనం

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 27: ఇటీవల కురిసిన వర్షాలు ఉల్లి రైతును కోలుకోలేని దెబ్బతీశాయి. మార్కెట్లో కాస్తోకూస్తో రేటు ఉందనుకుంటే రైతుల ఆశలు ఆవిరయ్యాయి. అప్పులు చేసి పంట సాగు చేసి నష్టాలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వెంకటగిరి రైతులు వాపోయారు. కోడుమూరు మండలంలోని వెంకటగిరి గ్రామం ఉల్లిసాగుకు ప్రత్యేకం. ఇక్కడ ఏటా ఖరీఫ్ సీజన్ కింద సుమారు 2వేల ఎకరాల్లో ఉల్లి పంట వేస్తారు. ఈ గ్రామ రైతులు గత కొన్నేళ్లుగా ఉల్లిని మాత్రమే సాగు చేస్తున్నారు. గ్రామంలో నల్లరేగడి పొలాలు అధికం. మంచి పదునైన వర్షం కురిస్తే సుమారు 20 రోజుల వరకు మొక్కకు తడి అందుతుంది. ఉల్లి సాగుకు నీరు చాలా అవసరం. వర్షంపై నమ్మకం ఉంచి రైతులు ఉల్లిసాగు చేస్తారు.

● **కొంపముంచిన అధిక వర్షాలు**: వర్షాధారం కింద సాగయ్యే ఉల్లి 3 నెలల కాలవ్యవధిలో చేతికందుతుంది. వెంకటగిరిలో ఈ ఏడాది జూలై ఆఖరు నుంచి ఉల్లినాట్లు వేశారు. పంట సాగుకాలంలో అడపాదడపా వర్షాలు పడడంతో ఉల్లి బెట్ట లేకుండా ఎదిగింది. అయితే వరుసగా వర్షాలు కురవడంతో పొలాల్లో వర్షపునీరు నిలిచి బురదగా మారాయి. ఉల్లి కోతలు ఆలస్యమయ్యాయి. పంట నాణ్యత దెబ్బతిన్నది.

● **పెరిగిన ఖర్చులు**: వర్షాలు తెరపిచ్చాక రైతులు కోతలకు దిగడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఎకరా ఉల్లి పీకేందుకు రూ 2వేలు, కోతకు రూ 9వేలు, పొలం నుంచి ఉల్లిని కల్లం చేర్చుటకు ట్రాక్టర్ ట్రిప్పుకు రూ వెయ్యి, గ్రేడింగ్ చేయడానికి ఒక్కో కూలీకి రూ. 600 చొప్పున ఖర్చు అయ్యిందని రైతులు గిడ్డారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మద్దిలేటి, నారాయణ, గిడ్డయ్య తెలిపారు. ఎకరా ఉల్లి సాగు పెట్టుబడి రూ. 80 వేలపైనే అయ్యిందని వాపోయారు. అధిక వర్షాలతో ఉల్లి దెబ్బతిని 30 నుంచి 50క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది.

● **అమ్ముకోవడానికి నానాతంటాలు**: వేలకు వేలు పెట్టుబడితో సాగుచేసిన రైతులు ఉల్లి అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కర్నూలు మార్కెట్లో ఉల్లి కొనుగోళ్లు నెమ్మదించడంతో గ్రామాల్లోకి వ్యాపారులు రావడం లేదు. దీంతో గత వారం రోజులుగా కల్లాల్లోనే ఉల్లిని ఆరబోసుకున్నారు. రోజూ గ్రేడింగ్ చేసుకుంటూ కాపాడుకుంటున్నారు. కల్లాల్లోనే గడుపుతున్నారు. అయితే కర్నూలు మార్కెట్లో ఉల్లి దిగుబడులు పెరిగి కొనుగోళ్ల జాప్యం కావడంతో రెండు రోజుల నుంచి ఇద్దరు, ముగ్గురు రైతులు కలిసి తాడేపల్లిగూడేనికి ఉల్లిని తరలిస్తున్నారు.



రోజూ గ్రేడింగ్ చేయిస్తున్నా

ఈ ఏడాది ఆరెకరాల్లో ఉల్లి సాగు చేశా. మొదట్లో మంచి వర్షాలతో పంట కళకళలాడింది. పంట పీకి ఉంచిన సమయంలో అధిక వర్షాలు కురిశాయి. దీంతో కోతలు ఆలస్యమయ్యాయి. నాలుగు రోజుల క్రితం పంట కోయించాను. గ్రామాల్లోకి వ్యాపారులు రావడం లేదు. కర్నూలు తరలించే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఉల్లి నాణ్యత దెబ్బతినకుండా కూలీలు వెచ్చించి ఉల్లి గ్రేడింగ్ చేయిస్తున్నా. - గిడ్డారెడ్డి, వెంకటగిరి



తాడేపల్లిగూడేనికి తరలిస్తున్న లోడ్



కుల్లిన ఉల్లి కుప్ప



క్వింటం రూ. వెయ్యికి కొన్నారు

రెండెకరాల్లో ఉల్లిసాగు చేశాను. ఎకరా రూ 70 వేలు ఖర్చు అయ్యింది. 220 ప్యాకెట్ల దిగుబడి వచ్చింది. అయితే కర్నూలు మార్కెట్‌కు సరుకు పోటెత్తడంతో అమ్మకాల్లో జాప్యం అవుతున్నట్లు తెలిసి తాడేపల్లిగూడెం తీసుకెళ్లాను. అక్కడ క్వింటం రూ వెయ్యికి కొన్నారు. నష్టం మూటగట్టుకున్నాను. -వెంకటేశ్, వెంకటగిరి

ఎన్నికల్లో ఐటీడీపీ పాత్ర కీలకం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఐటీడీపీ కీలక పాత్ర పోషించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 7 నియోజకవర్గాల నుంచి వచ్చిన ఐటీడీపీ సభ్యులతో ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్, రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, టూరిజం డైరెక్టర్ ముంతాజ్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీ సభ్యత్వం ఇచ్చే దిశగా పని చేస్తామని అన్నారు. చంద్రబాబు, నారా లోకేష్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యుల్లాగా కాపాడుకోవాలనే ఆలోచనతో ఈ కొత్త పాలసీ తెరపైకి తెచ్చారన్నారు. ఆదోని ఐటీడీపీ ఇన్‌చార్జి అంజలి, మంత్రాలయం ఐటీడీపీ ఇన్‌చార్జి నీలకంఠ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయంలో సభ్యత్వ నమోదు

- ఉద్యోగి కుర్చీలో కూర్చున్న టీడీపీ నాయకురాలు
- గుడిసె కృష్ణమ్మ తీరుపై విమర్శలు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఆదోని రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కర్నూలు జిల్లాలోని ఆదోని మండలం బైచిగేరి సచివాలయంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ ఆ పార్టీ కండువాను ధరించి తమ అనుచరగణంతో సచివాలయానికి వెళ్లారు. ఉద్యోగుల కుర్చీలో కూర్చొని టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె తీరుపై అధికారులు, ప్రజలు విస్తుపోయారు. టీడీపీ నాయకురాలి తీరు విమర్శలకు తావిస్తోంది. ఒక పార్టీకి చెందిన కార్యక్రమాన్ని ప్రభుత్వం కార్యాలయంలో ఎలా చేపడతారని ప్రశ్నిస్తున్నారు. గతంలో వైసీపీ నాయకులు కూడా ఆ పార్టీ కార్యక్రమాలను ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టిన ఘటనలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వంలో కూడా టీడీపీ నాయకులు అదే తీరును కొనసాగించడం ఏమిటని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇది ర్యాగింగ్ కాదట

- తేల్చిన యాంటీ ర్యాగింగ్ కమిటీ
- ప్రిన్సిపాల్ నియమించిన కమిటీ పక్కకు



కర్నూలు మెడికల్ కాలేజీ

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇది ర్యాగింగ్ కాదట.. ఫ్రెషర్స్‌కు సీనియర్స్ చెప్పిన మంచి మాటలు అని యాంటీ ర్యాగింగ్ కమిటీ తేల్చిందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ ఆదివారం తెలిపారు. ఇది ర్యాగింగే కాదని, దీనివల్ల ఎవరూ బాధపడలేదని తేల్చినట్లు చెప్పారు. జూనియర్ విద్యార్థులను సీనియర్లు మీసాలు, గడ్డాలు తీసేయాలని, షూ లేకుండా చెప్పులతో రావాలని, తాము చెప్పిన కళ్లజోడే వాడాలని, తాము చెప్పిన యాప్‌లనే స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడు చేసుకోవాలని ర్యాగింగ్ చేస్తున్నారంటూ ఈ నెల 21వ తేదీ పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా ఆరుగురి వైద్యులతో విచారణ కమిటీ వేసి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మూడు రోజుల తర్వాత విచారణ నివేదికను సమర్పించారు. విచారణలో సీనియర్లు జూనియర్లను వేధించినట్లు తెల్లకాగితంలో రాతపూర్వకంగా తెలియజేశారు. ర్యాగింగ్ జరిగినట్లుగానే విచారణ కమిటీ నివేదిక సమర్పించింది. ప్రిన్సిపాల్ విచారణ కమిటీ నివేదికను పత్రికలకు తెలియజేస్తారనుకున్న సమయంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి ఓ ఉత్తర్వు వచ్చింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ర్యాగింగ్‌పై యాంటీ ర్యాగింగ్ కమిటీ చేత విచారణ జరిపించి త్వరగా నివేదిక ఇవ్వాలని ఎన్ఎంసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రిన్సిపాల్ నాలుక కరుచుకుని ఆరుగురి విచారణ కమిటీని పక్కనబెట్టి శనివారం హడావుడిగా యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులతో విచారణ ప్రారంభించారు. అనాటమీ హాల్, న్యూలెక్చరర్ గ్యాలరీలో సీనియర్లు, జూనియర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆదివారం యాంటీ ర్యాగింగ్ కమిటీ ఇచ్చిన నివేదిక వివరాలు ప్రిన్సిపాల్ చెప్పడంపై అసలు ర్యాగింగ్‌పై విచారణ సవ్యంగా జరిగిందా? అనే అనుమానాలు కొందరు తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

ఇది ర్యాగింగ్ కాదు



నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు యాంటి ర్యాగింగ్ కమిటీ విచారణ చేపట్టినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. చిట్టినరసమ్మ తెలిపారు. విచారణలో భాగంగా 240 మంది విద్యార్థుల నుంచి రిటర్న్‌గా తీసుకున్నట్లు చెప్పారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్ ప్రిన్సిపాల్ కమిటీ సభ్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు డా.హరిచరణ్, డా.రేణుకాదేవి, డా. విజయానందబాబు విచారణ చేశారన్నారు. విద్యార్థులు ఎవరూ బాధపడలేదని, ఎవరూ భయపడ లేదని అసలు ఇది ర్యాగింగే కాదని కమిటీ తేల్చినట్లు ఆమె తెలిపారు.

అర్షద్.. అజేయుడు



- చిన్న వయస్సులోనే కాలు పోయినా సడలని విశ్వాసం
- నంద్యాల నుంచి పారా ఒలింపిక్స్ పోటీలకు ఎంపిక
- స్ఫూర్తిదాయకంగా దివ్యాంగ క్రీడాకారుడి పయనం

నంద్యాల, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే షేక్ అర్షద్ ఓ కాలును పోగొట్టుకున్నాడు. ఏ మాత్రం నిరుత్సాహపడకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. సంవత్సరాల తరబడి కఠిన సాధన చేస్తూ సైక్లింగ్‌లో ప్రావీణ్యం సంపాదించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మెరుగైన ప్రదర్శన కనబరచడంతో పారిస్‌లో ఇటీవల జరిగిన దివ్యాంగుల ఒలింపిక్స్‌కు భారత్ తరపున ఎంపికయ్యాడు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చని అర్షద్‌ను చూస్తే తెలుస్తుంది.



'జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సైక్లింగ్ ఈవెంట్లలో మెడల్స్ సాధించాను. పారా ఒలింపిక్ క్రీడల్లో పతకం సాధించి, దేశం పేరు నిలబెట్టాలని కలలుగన్నాను. అందుకు తగ్గట్టుగానే శ్రమించి ఈ ఏడాది పారిస్ పారా ఒలంపిక్స్‌లో పాల్గొన్నాను. అక్కడి వాతావరణం, ట్రాక్‌లపై అనుభవం లేకపోవటంతో పతకం సాధించటంలో వెనుకబడ్డాను. వచ్చే సారి చాన్స్ వస్తే పతకం సాధించేందుకు కృషి చేస్తా' అని చెబుతున్నాడు.

స్నేహితులు, ట్రైనర్ల సూచనలతోనే..

కాలు పోయిన తర్వాత నేను బయటకు రాలేని పరిస్థితుల్లో మా ఇంటి వద్దకు వచ్చి స్నేహితులు వచ్చి ఒంటరితనాన్ని దూరం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వేళ ఆదిత్య మెహతా ఫౌండేషన్ నాకు ఆసరా ఇచ్చింది. సైక్లింగ్‌లో శిక్షణ ఇప్పించింది. సైక్లింగ్‌లో 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాను. పారా ఒలింపిక్స్ సైక్లింగ్‌లో పాల్గొంటున్న మొదటి భారతీయుడిగా గర్వంగా ఉంది.

- అర్షద్, దివ్యాంగ క్రీడాకారుడు

ప్రమాదానికి గురై..

షేక్ అర్షద్ చిన్నప్పటి నుంచి చురుకుగా ఉండేవాడు. 12 ఏళ్ల వయస్సు వచ్చే సరికి తైక్వాండోలో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. అర్షద్‌ను చూసి తలిదండ్రులు మురిసిపోయేవారు. ఇలా సాగుతున్న తరుణంలో అర్షద్‌ను దురదృష్టం వెంటాడింది. కుటుంబంతో కలిసి పక్క ఊరిలోని బంధువుల ఫంక్షన్‌కు వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అర్షద్ ఎడమ కాలును మోకాలి పై భాగం వరకు తీసివేయాల్సి వచ్చింది. ఈ సమయంలో తనకు తైక్వాండో నేర్పిన ట్రైనర్లు ధైర్యాన్ని నూరిపోసి ఇతర క్రీడలపై దృష్టి సారించేలా చేశారు. తనకు ఇష్టమైన తైక్వాండో మళ్లీ సాగించే అవకాశం లేకపోవటంతో అర్షద్ ఇతర క్రీడలపై దృష్టి సారించాడు. ఆర్చరీ నేర్చుకోవటం ప్రారంభించాడు. కొద్ది రోజుల్లోనే ఆర్చరీలో రాటుదేలటమే కాకుండా నేషనల్ లెవెల్స్‌లో ఏడుసార్లు పాల్గొన్నాడు. ఆ తర్వాత బాడీ బిల్డింగ్‌పై దృష్టి సారించాడు. మిస్టర్ రాయలసీమ, మిస్టర్ సింహపురి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్‌లోనూ నేషనల్ లెవెల్స్‌లో పాల్గొన్నాడు. వీల్ చైర్ ఫెన్సింగ్‌లో సిల్వర్ మెడల్ (టీం) సాధించాడు. ఇలా దివ్యాంగుల పోటీల్లో సత్తా చాటాడు.

రోడ్ టు 2024 పారా ఒలింపిక్స్..

ఆర్చరీ, బాడీ బిల్డింగ్, వీల్ చైర్ ఫెన్సింగ్, స్విమ్మింగ్ వంటి క్రీడలకు డబ్బులు విపరీతంగా ఖర్చు అవుతాయి. ఆర్థిక స్తోమత లేక నంద్యాలలోని ఓ హోటల్‌లో రిసెప్షనిస్టుగా చేరాడు. ఆ సమయంలో ఆదిత్య మెహతా ఫౌండేషన్ అర్షద్ ప్రతిభను గుర్తించి ఫౌండేషన్‌లో చోటు కల్పించటమే కాకుండా సైక్లింగ్‌లో శిక్షణను ఇప్పించింది. అర్షద్ సైక్లింగ్‌లో త్వరలోనే పట్టు సాధించటమే కాకుండా 2022లో తజకిస్థాన్‌లో ఏషియన్ చాంపియన్స్ పోటీల్లో పాల్గొన్నాడు. సైక్లింగ్‌లో నాలుగో స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత ఢిల్లీలో జరిగిన సైక్లింగ్ చాంపియన్ షిప్‌లో 1,3 కి.మీ. వ్యక్తిగత సైక్లింగ్‌లో వెండి, కాంస్య పతకాలను సాధించాడు. ఇక ఆ తర్వాత 2022 మలేషియాలో జరిగిన ట్రాక్ ఈవెంట్‌లో కి.మీ. వ్యక్తిగత పర్స్యూట్‌లో గోల్డ్ మెడల్, టైమ్ ట్రయల్‌లో గోల్డ్ మెడల్, రోడ్ టైమ్ ట్రయల్‌లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించాడు. 2023లో పారిస్‌లో జరిగిన చాంపియన్ షిప్‌లో ట్రాక్ ఈవెంట్ సైక్లింగ్‌లో పాల్గొన్నాడు. అదే ఏడాది గ్లాస్గోలో జరిగిన ట్రాక్, రోడ్ సైక్లింగ్ ఈవెంట్లలో పాల్గొన్నాడు.



అదే ఏడాది చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో ట్రాక్, రోడ్ సైక్లింగ్ ఈవెంట్లలో పాల్గొని 5వ స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం అర్షద్ పారా సైక్లింగ్ ఆటగాళ్లలో భారత్ నంబర్ 1, ఏషియా నంబర్ 2, వరల్డ్ నంబరు 5వ స్థానంలో ఉన్నాడు. ర్యాంకులు బాగా మెరుగుపరుచుకోవటంతో భారత్ తరపున ఎంసీ-2 కేటగిరిలో పారా ఒలంపిక్స్‌లో అర్షద్ అర్హత సాధించాడు.

ఉల్లి కొనుగోళ్లు వేగవంతం చేస్తాం

సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కర్నూలు మార్కెట్ యార్డులో ఈనామ్ సర్వర్ పని చేయకపోవడంతో కొనుగోళ్లు ఆలస్యమయ్యాయని, ఈ పరిస్థితిని నివారించేందుకు కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు సహకరించాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కర్నూలు మార్కెట్ కమిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో జేడీ రామాంజనేయులు, సెక్రటరీ జయలక్ష్మి, కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సోమ, బుధ, శనివారాల్లో మాత్రమే ఉల్లిగడ్డలను క్రయవిక్రయాలకు అనుమతించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మంగళ, శనివారాల్లో మాత్రమే ఇతర పంట ఉత్పత్తులు వేరుశనగ, మొక్కజొన్నలు తదితర పంట ఉత్పత్తుల విక్రయానికి అనుమతించనున్నట్లు సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. రైతులు యార్డులో పంట ఉత్పత్తుల విక్రయానికి ప్రతి రోజురాత్రి 12 గంల నుంచి ఉదయం 8 గంటలలోపు యార్డుకు తీసుకువచ్చేందుకు అనుమతి ఇచ్చామని సెక్రటరీ తెలిపారు. సమావేశంలో గ్రేడ్-2 సెక్రటరీ మాధవకృష్ణారెడ్డి, అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ పాల్గొన్నారు.

భక్తులతో మార్మోగిన మంత్రాలయం

మంత్రాలయం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మఠం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారాయి.

నేడు ఏకాదశి పూజలు బంద్

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు బంద్ చేస్తారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు.



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం ప్రాంగణం

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం


మహానంది, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): లోక క్షేమం కోసం మహానందిలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ మహానందీశ్వరుడి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పూల అలంకారంతో తీర్చిదిద్దారు. అనంతరం వేదమంత్రాలతో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పూర్తిగా తగ్గిన నీటి ప్రవాహం

మంత్రాలయం వద్ద 308.16 మీటర్ల నీటిమట్టం



మంత్రాలయం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది ప్రవాహం పూర్తిగా తగ్గింది .ఆదివారం సాయంత్రం మంత్రాలయం వద్ద 308.16 మీటర్ల నీటి మట్టంతో 17,250 క్యూసెక్కుల నీరు ప్రవహించింది. టీబీ డ్యాం నుంచి 1.06 లక్షల క్యూసెక్కుల నీరు నదికి విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం డ్యామ్ గేట్లను ఎత్తి 3,280 క్యూసెక్కుల నీరు నదికి వదిలారు. దీంతో తుంగభద్రనది రెండువైపులా సరిహద్దులను తాకుతూ ప్రవాహం శాంతించింది.

డంప్ చేసి.. దర్జాగా అమ్మేస్తున్నారు

7వ పేజీ తరువాయి

గత ప్రభుత్వంలో ఇసుక అమ్మకాలను ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వారికి అప్పజెప్పింది. దీంతో ఆయా రీచ్‌లను నిర్వహించేవారు తమ ఇష్టానికి అనుగుణంగా నది నుంచి ఇసుకను తవ్వుకుంటూ లెక్కకు మించి ఇసుకను తరలించారు. పూర్తిగా గుత్తేదారులకు మేలు చేకూర్చే ఈ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ఇసుక పక్కదారి పట్టకుండా సొంతానికి వాడుకునే వారే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ సమయంలో తమకు సంబంధించిన వాహనం నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇలాంటి నిబంధన విధించడానికి కారణం లేకపోలేదు. ఒక భవన నిర్మాణం పనులను ఎక్కువ మందితో చేయించినా.. ఒక టిప్పర్ ఇసుక కనీసం మూడు రోజుల వరకు వస్తుంది. మళ్లీ బుక్ చేసుకునే సమయంలో మళ్లీ అదే వాహనం నంబర్ ఇవ్వాల్సి వస్తే కొద్ది రోజులు ఆగాల్సి ఉంటుంది. దీనివల్ల ఒకే వ్యక్తి ఎక్కువ మొత్తంలో ఇసుకను డంప్ చేసుకోకుండా ఉంటుంది. ఇక ఇదే సమయంలో అవసరమున్నవారికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. కానీ అక్రమార్కులు మాత్రం ఏం మాయ చేస్తున్నారో, ఏమోగాని లెక్కకు మించి టిప్పర్ల ద్వారా ఇసుకను నంద్యాలకు తరలించి డంప్ చేస్తున్నారు. దీనివల్ల నిజంగా అవసరం ఉన్న వారికి ఇసుక కొరత ఏర్పడి అక్రమార్కులను ఆశ్రయించాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఇంత పకడ్బందీగా ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా ఇసుకను డంప్ చేయడం ఎలా సాధ్యమనే ప్రశ్న వ్యక్తమవుతోంది. అక్రమార్కులే భవన యజమానులు అవతారమెత్తి ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ఇసుకను నంద్యాలలో డంప్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇసుక అసోసియేషన్ నాయకుడి వత్తాసు?

నంద్యాలలో ఇసుక దందా నిర్వాహకులకు సంబంధిత ఇసుక అసోసియేషన్ నాయకుడు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. సదరు నాయకుడు గత ప్రభుత్వం సమయంలో అప్పటి అధికార పార్టీ నాయకులతో అంటకాగాడు. అధికారం మారిన వెంటనే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నేతలతో కలిసి తిరుగుతున్నాడు. కూటమి నాయకులు తనకు సన్నిహితులు అనే రీతిలో అందరినీ మభ్యపెడుతున్నాడు. ఇదంతా ఇసుక దందాను పూర్తిగా తన గుప్పిట్లోకి తీసుకునే ప్రయత్నం అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతరులు ఎవరైనా ఇసుకను అమ్మే ప్రయత్నం చేస్తే అధికారులకు సమాచారం ఇచ్చి పట్టుబడేలా చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఇలానే మైదుకూరుకు చెందిన ఓ లారీని అధికారులకు పట్టించినట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడే అధికారుల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకను అక్రమంగా ఎవరు తరలించినా పట్టుకోవాలి. అయితే సదరు నాయకుడికి సంబంధించిన ఇసుక డంప్ పట్టణం నడిబొడ్డున ఉన్నా అధికారులు ఎందుకు దాడులు చేయటం లేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి సంబంధించిన వారనే ఉద్దేశంతోనే అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి ప్రభుత్వం మారినా దందా రాయుళ్లు మాత్రం తమ లాభసాటి వ్యాపారాన్ని సజావుగానే సాగిస్తున్నారని, దీనివల్ల ప్రజలకు జరగాల్సిన మేలు అటకెక్కిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.



నంద్యాలలో శివారులో ఇసుక డంప్

కనిపించని నిఘా

'ఇసుక అక్రమ రవాణా చేసినా, నిబంధనలకు విరుద్ధంగా డంప్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటాం' అంటూ ప్రభుత్వం ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉంది. అయినా అక్రమార్కులు ఏమాత్రం బెదరటం లేదు. ఇరత జిల్లాల నుంచి ఇసుకను తరలించాలంటే కచ్చితంగా జాతీయ రాహదారి ద్వారానే రావాల్సి ఉంటుంది. జాతీయ రహదారుల్లో తనిఖీలు చేస్తే ఇసుకను అక్రమ రవాణా విషయం ఇట్టే బయటపడుతుంది. ఒకవేళ తప్పుడు పత్రాలు చూపించి అప్పుడు తప్పించుకున్నా.. నంద్యాలకు వచ్చిన తర్వాత ఎక్కడెక్కడ డంప్ చేస్తున్నారనే విషయాన్ని అధికారులు ఆరా తీస్తే సులభంగా తెలిసిపోతుంది. ఇసుకను తవ్వే బాధ్యత ఒకరిది, వాటికి రాయల్టీని వసూలు చేసేది మరోక శాఖ, దాడులు చేయాల్సింది ఇంకో శాఖ అవటంతో ఎవరికి వారు ఇసుక అక్రమ రవాణాను నిలువరించటం తమ బాధ్యత కాదని పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అక్రమ ఇసుక డంప్‌ల మీద దాడుల చేసి పట్టుకునే బాధ్యత రెవెన్యూ అధికారులది. ఇటు పద్మావతి నగర్ నుంచి అటు క్రాంతినగర్, నూనెపల్లి వంటి ప్రాంతాలు కలెక్టరేట్‌కు గానీ, స్థానిక తహసీల్దారు కార్యాలయానికి గానీ పెద్ద దూరంలో ఏమీ లేవు. అయినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు అక్రమార్కుల ఆటకట్టించి ఇసుక దందాకు తెరదించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానం సామాన్యులకు లాభదాయకంగా ఉంటుంది. అలా కాని పక్షంలో గత ప్రభుత్వంలో మల్లే కూటమి ప్రభుత్వంలో కూడా అక్రమార్కులకు, దందాలు చేసేవారికి సొమ్ములు రాల్చటమే కాకుండా, ప్రభుత్వానికి చెడు పేరు తీసుకువస్తుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

జీడీపీ గతేమిటి?

7వ పేజీ తరువాయి

జీడీపీ సామర్థ్యం, మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే పనుల్లో భాగంగా.. ప్రస్తుతం ఉన్న మట్టి ఆనకట్టకు సమాంతరంగా భూ మట్టం (గ్రౌండ్ లెవల్)లో 8-18 మీటర్లు, టాప్ లెవల్ 6 మీటర్ల వెడల్పు, 4.313 కిలో మీటర్లు పొడవు మట్టి ఆనకట్ట, రాక్‌టో, సీపేజ్ డ్రైనేజీ నిర్మాణ.. పెంచిన ఆనకట్టకు లోపలి వైపు రాతి పరుపు (స్టోన్ రివిట్మెంట్) వంటి పనులు రూ.35 కోట్లతో చేపట్టారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తుంగలో కలిపేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో చేసిన పనులు పరిశీలిస్తే ఇది నిజమే అనిపిస్తుంది. పాత ఆనకట్టపైన మీటరు ఎత్తు పెంచారు. లోపలి వైపు పాత ఆయకట్ట రాతి పరుపు (స్టోన్ రివిట్మెంట్) నుంచి పెంచిన మట్టి ఆనకట్టకు రాతి పరుపు ఏర్పాటు చేశారు. 37 ఏళ్లు దాటిన పాత రాతిపరుపు చెక్కు చెదరలేదు. కొత్తగా ఏర్పాటు చేసిన రాతిపరుపు అప్పుడే రాళ్లు ఊడిపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రాళ్ల పరిమాణం (సైజు), బరువు నిబంధనలు కంటే తక్కువగా ఉండడమే అని నిపుణులు అంటున్నారు. మట్టికట్ట టాప్ లెవల్‌లో పడే వర్షపు నీటిని దిగువకు మళ్లించేందుకు పలు ప్రాంతాల్లో వర్షపు నీటి డ్రైన్లు నిర్మించారు. నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోలేదో.. నాణ్యత పాటించలేదో.. కాంట్రాక్టరు, పర్యవేక్షణ ఇంజనీర్లకే తెలియాలి. ఆ ప్రాంతాల్లో మట్టికట్ట కోతకు గురై కుంగిపోతున్నది. రిపేరి చేయాల్సి వస్తే అక్కడ చదును చేస్తారే తప్ప.. గట్టిపడేందుకు రోలింగ్ చేసే అవకాశాలు లేవు. ఆకనట్ట పొడవునా కోతకు గుర్రై కుంగిపోయిన మట్టి గుంతలే దర్శనం ఇస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రూ.10 కోట్లకు పైగా బకాయి చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు చేతులెత్తేసినట్లు తెలుస్తున్నది.




గాజులదిన్నె జలాశయం

స్టాప్‌లాగ్ గేటు దిగువన లీకేజీ:

ప్రాజెక్టు ఆరు గేట్లు డిశ్చార్జ్ కెపాసిటీ (వరద విడుదల సామర్థ్యం) 80 వేల క్యూసెక్కులు. రూ.12 కోట్లతో కొత్త క్రస్ట్‌గేట్లు గేట్ల ఏర్పాటు కోసం 2023 సెప్టెంబరు నెలలోనే నూతన గేట్ల తయారీ (ఫ్యాబ్రికేషన్) పూర్తి చేశారు. డ్యాంలో నీరు దిగువకు వెళ్లకుండా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చాల్సి (ఎరక్షన్) ఉంది. పాత గేట్ల ఇనుప తాళ్ల (రోప్స్) తొలగించి కిందకు దింపేశారే తప్ప కొత్త గేట్లు అమర్చలేదు. వరదొస్తే ఆనకట్టకు ముప్పు పొంచి ఉందని ఈ ఏడాది మేలో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా ఈ విషయం సీరియస్‌గా తీసుకొని కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు నాలుగు కొత్త గేట్లు ఏర్పాటు చేశారు. ఐదో గేటుకు స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు చేశారే తప్ప కొత్త గేటు ఏర్పాటు చేయలేదు. స్టాప్‌లాగ్ గేటు దిగువ నుంచి డ్యాంలో నిల్వ నీరు లీకేజీ రూపంలో బయటకు పోతోంది. లీకేజీకి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. 4.5 టీఎంసీలు సామర్థ్యం కాగా.. ప్రస్తుతం 2.85 టీఎంసీలు కూడా నిల్వ చేయలేని పరిస్థితి ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు, జలవనరుల శాఖ ఇంజనీర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అసంపూర్తి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. అదే క్రమంలో నాణ్యత ప్రమాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయించాలని, అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు కోరుతున్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టు స్వరూపం

● ప్రాజెక్టు	: గాజులదిన్నె ప్రాజెక్టు (సంజీవయ్య సాగర్)
● సామర్థ్యం	: 4.50 టీఎంసీలు
● ఆయకట్టు	: 25,454
● ఎఫ్ఆర్ఎల్ లెవల్	: 377 మీటర్లు
● ఎత్తు పెంచితే సామర్థ్యం	: 5.50 టీఎంసీలు
● ఎఫ్ఆర్ఎల్ లెవల్	: 478 మీటర్లు
● ఆయకట్ట పొడవు	: 4.313 కిలో మీటర్లు
● మంజూరైన నిధులు	: రూ.57.35 కోట్లు
● తాగునీటి ఆధారం	:డోన్,ఎమ్మిగనూరు, కోడుమూరు, కృష్ణగిరి పట్టణాలు సహా పలు గ్రామాలు



రాతిపరుపు (స్టోన్ రివిట్మెంట్) ఇలా...

కృష్ణమ్మ ఒడిలో సీ ప్లేన్

- తొలి దశలో బెజవాడ-శ్రీశైలానికి సర్వీసు
- ప్రకాశం బ్యారేజ్ ప్రాంతంలో వాటర్ డ్రోమ్ ఏర్పాటు
- నవంబరు 9న ప్రారంభం కానున్న ప్రాజెక్టు
- విజయవాడ నుంచి శ్రీశైలం వరకు తొలి దశలో సర్వీసులు
- క్రమేణా మిగిలిన రూట్లకు కూడా విస్తరణ

మాల్దీవుల్లో కనిపించే సీ ప్లేన్స్ ఇక విజయవాడలోనూ సందడి చేయనున్నాయి. బెజవాడ నుంచి శ్రీశైలానికి తొలి దశలో సర్వీసులను నడపనున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 9 న ప్రారంభించనుంది. ప్రజల ఆదరణకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని రూట్లకు ఈ సర్వీసులను విస్తరించనుంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నీటిలో తేలియాడుతూ ఆకాశవీధిలో విహరించే సీ ప్లేన్ సర్వీసులు విజయవాడ వాసులకు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. కృష్ణానదిలో చక్కర్లు కొట్టనున్నాయి. స్థానికులకు మెరుగైన సేవలు అందించనున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన సీ ప్లేన్ ప్రాజెక్టుకు నవంబరు 9న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు తొలి దశలో సీ ప్లేన్ సర్వీసును ప్రారంభించనున్నారు. డిమాండ్‌ను బట్టి ఈ సర్వీసులను మరిన్ని పెంచుతారు. ఇతర ప్రాంతాలకు కూడా క్రమేణా సీ ప్లేన్ సర్వీసులను విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

దుర్గాఘాట్‌లో వాటర్ ఏరో డ్రోమ్

ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రకాశం బ్యారేజీ దగ్గర వాటర్ ఏరో డ్రోమ్ ఏర్పాటు చేయనున్నారు. సీ ప్లేన్ వాటర్ వే కూడా ఏర్పాటు చేస్తారు. వాటర్ ఏరో డ్రోమ్ ఏర్పాటుకు ఇప్పటికే సివిల్ ఏవియేషన్ అధికారులు స్థల పరిశీలన చేశారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం దిగువున దుర్గాఘాట్ సమీపంలో వాటర్‌డ్రోమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోను న్నారు. సీ ప్లేన్ రాకపోకలకు వాటర్‌డ్రోమ్ ఎంతో కీలకంగా మారనుంది. విమానాశ్రయా లలో ఏరో డ్రోమ్ ఎంత కీలకంగా ఉంటుందో.. వాటర్ డ్రోమ్ కూడా అంతే కీలకంగా పనిచే స్తుంది. వాటర్ డ్రోమ్ ద్వారానే సీ ప్లేన్‌ను నిర్వహించటం సాధ్యమవుతుంది.

జెట్టీ మీద సీ ప్లేన్ ల్యాండ్

సీ ప్లేన్ ల్యాండింగ్ కోసం ఒక వాటర్ వే ఏర్పాటు చేస్తారు. వాటర్‌వే మాత్రమే కాకుండా.. కృష్ణానదిలో ఎక్కడైనా సీ ప్లేన్ ల్యాండ్ అవగలదు. ప్రయాణికులు ఎక్కటానికి వీలుగా వాటర్‌వే ఏర్పాటు చేస్తున్నారు. వాటర్ వే కోసం దుర్భేద్యమైన జెట్టీలను ఏర్పాటు చేస్తారు. ఈ జెట్టీ మీద సీ ప్లేన్ ల్యాండ్ అవుతుంది. ప్రయాణికులు బోటులో ఈ జెట్టీ దగ్గరకు వచ్చి సీ ప్లేన్ ఎక్కాల్సి ఉంటుంది. విజయవాడ నుంచి బయలుదేరిన సీ ప్లేన్ నేరుగా శ్రీశైలంలో పాతళగంగ దగ్గర కృష్ణానది మీద ల్యాండ్ అవుతుంది. అతి తక్కువ ఖర్చుతో ఒకే రోజు రాష్ట్రంలోని రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చు. సీ ప్లేన్ సర్వీసులను ఏ సంస్థ ద్వారా నడుపుతారన్నదానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మన దగ్గర స్పైస్ జెట్ సంస్థ సీ ప్లేన్‌లను నడుపుతోంది. ఈ సంస్థ ద్వారా విమాన సర్వీసును నడిపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బెజవాడ-శ్రీశైలం మధ్య ఆధ్యాత్మిక బంధం

సీ ప్లేన్ ప్రాజెక్టుతో విజయవాడ - శ్రీశైలం మధ్యన ఆధ్యాత్మిక బంధం ఏర్పడనుంది. దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్న భక్తులు శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునులను కూడా దర్శించుకునే భాగ్యం సీ ప్లేన్ ద్వారా కలగనుంది. ఈ రెండు ప్రాంతాల మధ్యన టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చెందనుంది.

పర్యాటక రంగానికి మరింత ఊతం

సీ ప్లేన్ ప్రాజెక్టు వల్ల పర్యాటక రంగానికి మరింత ఊతం ఇచ్చినట్లు అవుతుంది. కృష్ణానది, గోదావరి, పెన్నా తదితర నదుల తీరాల వెంబడి ఆహ్లాదకరమైన ప్రకృతి సంపద ఉంది. అలాగే ఎంతో చరిత్ర కలిగిన దేవాలయాలు ఉన్నాయి. సీ ప్లేన్ ప్రాజెక్టుల వల్ల పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుంది.

మరిన్ని ప్రాంతాలకు సీ ప్లేన్ సర్వీసులు

తొలి దశలో విజయవాడ నుంచి శ్రీశైలానికి సీ ప్లేన్ సర్వీసును ప్రారంభిస్తున్నారు. ఈ సర్వీసుకు వచ్చిన ఆదరణను దృష్టిలో పెట్టుకుని విజయవాడ- హుస్సేన్‌సాగర్, విజయవాడ - విశాఖపట్నం రూట్లపై కూడా సీ ప్లేన్ సర్వీసులను నడిపేందుకు దృష్టి సారిస్తారు. ముందు విజయవాడ - శ్రీశైలం మధ్యన సర్వీసుకు వచ్చే డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు మిగిలిన రూట్లపై దృష్టి సారిస్తారు.

ఆయన వైసీపీ పోలీసు..!?

- డీఎస్పీ ఆఫీసులో ఆయనదే పెత్తనం
- గత వైసీపీ ఎమ్మెల్యేకు పీఏ
- టీడీపీ సానుభూతిపరులైన పోలీసులంటే గిట్టదు



కర్నూలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదోని ఓల్డ్ డివిజన్ పరిధిలోని కీలకమైన సబ్ డివిజన్ పోలీసు కార్యాలయం అది. అక్కడంతా ఓ వైసీపీ పోలీసుదే పెత్తనం. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యే పీఏగా ఆయన పని చేశారు. ఆయనలో ఇంకా వైసీపీ వాసన పోలేదని, టీడీపీ కూటమి సానుభూతి పరులైన పోలీసులన్నా.. అధికారులన్నా ఆయనకు గిట్టదని గుసగుసలాడుతున్నారు. పోలీసులు, హోంగార్డులపై డీఎస్పీకి లేనిపో నివి చెప్పి వేధింపులకు గురి చేరుస్తున్నాడని అనుకుం టున్నారు. రాష్ట్ర సరిహద్దు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ.. డీఎస్పీ ఆఫీసుకు డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయన సీసీ అని చెప్పుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారని.. పై అధికారులకు చెప్పుకోలేక.. వేధింపులు భరించలేని నరకయాతన అనుభ విస్తున్నామని పోలీసులే ఆరోపిస్తున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీకి వాస్తవాలు తెలుసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. తనకు ఎస్పీ కార్యాలయంలో పని చేసే అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయంటూ సదరు వైసీపీ పోలీసు డీఎస్పీ కార్యాలయం పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పని చేసే ఖాకీలను కూడా పరోక్షంగా బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం ఒంటి గంట దాటితే.. ఆ డీఎస్పీ కార్యాలయం వైసీపీ కార్యాలయంగా మారుతు న్నదని, ఆ పార్టీ ముఖ్య నాయకులు డీఎస్పీ ఆఫీసుకు వచ్చి గంటల తరబడి ఉంటూ తమ పనులు చేసుకొని వెళ్తున్నారనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. పది పదిహేను రోజుల సీసీ కెమెరాలు చెక్ చేస్తే వాస్తవాలు ఏమిటో తెలుస్తాయని అంటున్నారు.

అదే ఆఫీసులో పనిచేసే మరో కానిస్టేబుల్‌పై డీఎస్పీకి ఫిర్యాదు చేసి ఆయనను అక్కడి నుంచి బదిలీ చేయించారని, దీని వెనుక మెయింటెనెన్స్ కోసం ఆయా పోలీస్ స్టేషన్ల నుంచి అనధికా రికంగా ఇచ్చే ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని తెలుస్తున్నది. అదే సబ్ డివిజన్ పరిధిలో టీడీపీ నాయకులను కాదని, వైసీపీ కీలక ప్రజా ప్రతినిధి ఆదేశాల మేరకు వివిధ కేసులకు సంబంధించిన పనులు చకచకా చేసిపెట్టినట్లు సమాచారం. టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు వెళ్లితే డీఎస్పీని కూడా కలవనీకుండా సదరు పోలీసు బయటి నుంచే పంపించేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బాణసంచా స్టాళ్లకు లైసెన్సు ఇవ్వాలి

- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియమ నిబంధనల ప్రకారం బాణాసంచా స్టాల్స్ ఏర్పాటుకు లైసెన్సులు మంజూరు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బాణాసంచా స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిపై ఏమైనా నేర చరిత్ర ఉందా..? లేదా అని వెరిఫై చేసి లైసెన్సు ఇవ్వాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. దుకాణానికి మరో దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలని, షాపులను ఇన్వెస్టబుల్ మెటీరియల్‌తో నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలతోనే విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కారమవుతాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గోకారి అధ్యక్షతన జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్, జీపీఎస్‌లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న 21 వేల కోట్ల బకాయిలను మంజూరు చేయాలని కోరారు. జీవో 84ను సవరించాలని, బదిలీలకు పదోన్నతులకు శాశ్వత కోడ్ చట్టం రూపొందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ నాగరాజు, వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, సుంకన్న, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, ప్రసన్న పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యం కథ సుఖాంతం

కర్నూలు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ వసతి గృహ విద్యార్థిని అదృశ్యమైన కథ సుఖాంతమైంది. బి.తాండ్రపాడుకు చెందిన చైత్ర హాస్టల్‌లో ఉంటూ ఎ.క్యాంపులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. శనివారం సాయంత్రం తల్లిదండ్రులు గుర్తుకు వచ్చి హాస్టల్ నుంచి బయటకు వచ్చింది. వినాయక ఘాట్‌కు వచ్చిన తర్వాత ఎటు పోవాలో అర్థం గాక ఏడ్చుకుంటూ ఉండింది. అక్కడే పండ్ల వ్యాపారం చేసే మహిళ చిన్నారిని చేరదీసి వివరాలడిగితే సరైన సమాధానాలు చెప్పలేకపోయింది. చిన్నారిని ప్రజానగర్‌లోని ఇంటికి తీసుకెళ్లింది. వసతి గృహం నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి, ఆటో డ్రైవర్లకు సమాచారం ఇచ్చారు. ప్రజానగర్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ ఫాతిమా అనే మహిళ ఓ చిన్నారి ఉందంటూ సమాచారం ఇవ్వడంతో పోలీసులు విచారిస్తే చిన్నారి విషయం వెలుగులోకి వచ్చింది. రాత్రి చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

దీపావళికి మహాశక్తి



- ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం
- 31 నుంచి అమలుకు శ్రీకారం
- తెల్ల రేషన్‌కార్డు ఉన్న వాళ్లందరూ అర్హులే, రేపటి నుంచే బుకింగ్
- సమస్యలపై 1967 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించవచ్చు
- లబ్ధిదారుల జాబితా తయారీలో అధికారులు నిమగ్నం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎన్నికల హామీల్లోని సూపర్ సిక్స్‌లో మహాశక్తి పథకం ఒకటి. దీని కింద పేద మహిళలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది దీపావళి నుంచి అమలు కానున్నది. అర్హులందరూ మూడు సిలిండర్లపై నగదును డీబీటీ విధానం కింద పొందనున్నారు. సిలిండర్ డెలివరీ సమయంలో నగదు మొత్తం చెల్లించాలి. సిలిండర్‌కు కేంద్రం ఇచ్చే రాయితీ పోను మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల వ్యవధిలో జమ చేయనున్నది.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాశక్తి పథకం పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 6.64 లక్షలు, దీపం కింద 1.50 లక్షలు ఉజ్వల కింద 58వేలు, సీఎస్ఆర్ 54వేలు, జనరల్ కింద 3.81 లక్షలు ఉన్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.858 ఉండగా.. ప్రభుత్వం రాయితీ రూ.41 ఇస్తోంది. ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఒక సిలిండర్‌పై రూ.300 చొప్పున 12 సిలిండర్లకు రాయితీ ఇస్తోంది. ఒక్కొక్క సిలిండర్‌పై రూ.558 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మూడు సిలిండర్ల మొత్తాన్ని భరించాల్సి ఉంటుంది.

తెల్లరేషన్ కార్డుదారులు అర్హులు:

తెల్లరేషన్ కార్డు ఉన్న వారంతా ఉచిత సిలిండర్‌కు అర్హులేనని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం నుంచి గ్యాస్ సిలిండర్లను గ్యాస్ వినియోగదారులు బుకింగ్ చేసుకోవచ్చు. వారికి ఈ నెల 31న ప్రారంభించి దీపావళి కానుకగా అందజేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడానికి షెడ్యూల్ ఖరారు చేశారు. మొదటి సిలిండర్ మార్చి 31లోపు, రెండోది జూలై 31లోపు, మూడోది నవంబరు 30లోపు ఎప్పుడైనా పొందవచ్చు. ఈ పథకం అమలుకై ఏడాదిని బ్లాక్ పీరియడ్లుగా విభజించారు. మొదటి బ్లాక్ పీరియడ్ ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు, రెండో బ్లాక్ పీరియడ్ ఆగస్టు 1 నుంచి నవంబరు 31 వరకు, మూడో బ్లాక్ పీరియడ్ డిసెంబరు 1 నుంచి మార్చి 31 వరకు విభజించారు. గ్యాస్ పంపిణీ పట్టణాల్లో, నగరాలలో 24 గంటలు, గ్రామాల్లో 48 గంటల్లోగా గ్యాస్ పంపిణీ చేస్తారు. ఈ పథకం అమలులో లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు. జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు, గ్యాస్ కంపెనీల వారీగా కనెక్షన్లు, దీపం, ఉజ్వల కనెక్షన్లు, తెల్లరేషన్ కార్డుదారులు ఉన్న గ్యాస్ కనెక్షన్ వివరాలను పౌరసరఫరాల అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు.

చంద్రబాబు నాయకత్వంలో పారిశ్రామిక ప్రగతి

- సీడ్స్ కార్పరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పారిశ్రామికప్రగతి రాబోతుందని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాదులో రాష్ట్ర రోడ్ల, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని సుబ్బారెడ్డి కలిశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అంధకారంలో ఉందని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికా రంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, పారిశ్రామిక ప్రగతి దూసుకెళ్తోందని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును పారిశ్రామికహబ్‌గా మారుస్తుండటంతో నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

6న కాల్వబుగ్గలో వేలం

ఓర్వకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ ఆలయంలో అక్టోబరు 6న వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో మద్దిలేటి ఆదివారం తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో టెంకాయలు అమ్ముకోడానికి పార్కింగ్ ఫీజు వసూలు చేసేందుకు తాత్కాలిక కళ్యాణ మండపం, టీటీడీ కళ్యాణ మండపం, సుంకిరెడ్డి, సదానంద సత్రాలకు సప్లయ్ సామానులు పెట్టుకునే హక్కు, దేవస్థానం సత్రాలు, సప్లయ్ 1, 2, 3 దుకాణాలు దేవస్థానం మామిడి హోటళ్ల, ఆలయ ప్రాంగణం వద్ద దుకాణాల ఏర్పాటుకు వేలం నిర్వహిస్తామన్నారు.

క్రైమ్ న్యూస్

విద్యార్థిని ఆత్మహత్య

మిడుతూరు, అక్టోబరు 27(ఆంధజ్యోతి): మిడుతూరు గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మిడుతూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె ఇంటర్ చదువుతోంది. దూరపు బంధువులు శ్రీనివాసులు కుమార్తెకు పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని శనివారం విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిర్వహించినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

మహిళ ఆచూకీ లభ్యం

కర్నూలు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన నారాయణమ్మ అనే మహిళ ఆచూకీ లభించింది. నెల్లూరు చెందిన ఈమె కర్నూలు శ్రీరామ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చి కనిపించకుండా పోయింది. కర్నూలు కొత్త ప్రదేశం కావడంతో ఇల్లు గుర్తు పట్టలేక నగరంలో తిరుగుతూ ఉంది. బంధువులు ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో ఆమెను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైలు నుంచి పడి మృతి


కర్నూలు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి కింద పడిన సచిన్ బార్మన్ అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. నంద్యాల రైల్వేస్టేషన్ పరిధిలో మార్కాపురం వద్ద పోలీసులు మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉంటాడని సీఐ తెలిపారు.

అనుమానాస్పదంగా వృద్ధుడు..

ఆలూరు రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దహోతూరు గ్రామానికి చెందిన షేకప్ప (75,) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తన తండ్రి మృతిపై అనుమానాలు ఉన్నాయని కుమారుడు ఖాసీం సాబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు మృతదేహాన్ని పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్..

వెల్దుర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ ఆదివారం మృతి చెందాడు. సూదేపల్లె గ్రామానికి చెందిన సునీల్ కుమార్ (22) సొంత ఆటోలో ఆదివారం వ్యవసాయ పనులకు క్రిష్ణగిరి మండలం గూడెంపాడుకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం తరువాత ఆటో లోనే నిద్రపోయాడు. కొద్దిసేపటికి పక్కన ఉన్నవారు నిద్రలేపడానికి యత్నించగా స్పందించ లేదు. నోటిలో నుంచి నురగ వస్తుండంతో వైద్యం నిమిత్తం వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణిం చినట్లు ధృవీకరిం చారు. ఇతనికి వివాహం కాలేదు. ఒక్కగాకొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



సునీల్‌కుమార్(ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడు..

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రఫిక్ (28) విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. మైనారిటీ కాలనీలో నివాసం ఉంటూ కర్నూలు బైపాస్ రోడ్డులో వెల్డింగ్ షాప్ పెట్టుకొని జీవిస్తున్న రఫీక్‌కు 5నెలల క్రితం వివాహమైంది. ఆదివారం ఉదయం వడ్డే కాలనీలో వెల్డింగ్ పని చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. భార్య రోదనతో స్థానికులు కంటతడి పెట్టారు.



రఫిక్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని అతిధి హోటల్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నపూజ మధుసూధన్‌రెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి పట్టణ శివార్లలోని ఓ హోటల్ నుంచి ఆత్మకూరు పట్టణంలోని బైక్‌పై వస్తున్నారు. ఈక్రమంలోనే బైకు అదుపుతప్పి కిందపడగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వాహనం అందుబాటులో లేకపోవడంతో మరో వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పద్మవ్యూహంలా బళ్లారి చౌరస్తా

● వాహనాల రద్దీతో జనం ఉక్కిరిబిక్కిరి
● కాలినడకన వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే..



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో ఒక ప్పుడు రాజ్‌విహార్ సర్కిల్ నుంచి పక్క ప్రాంతాలకు వెళ్లాలంటే నగర ప్రజలు చుక్కలు చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు అక్కడ పరిస్థితి మారిపోయింది. నిమిషాల వ్యవధిలోనే వాహనాలకు ముందుకు వెళ్లేందుకు సిగ్నల్స్ క్లియరెన్స్ ఇచ్చేస్తున్నాయి. అయితే కొత్తబస్టాండు సమీపంలోని బళ్లారి చౌరస్తా పద్మవ్యూహంలా మారింది. రాజ్‌విహార్ సర్కిల్‌లో ఇద్దరు పోలీసులు మాత్రమే ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తుండగా బళ్లారి చౌరస్తాలో నలుగురు ఉన్నా సమస్య క్లియర్ కావడం లేదు. నలుగురు పోలీసులు అటు.. ఇటూ పరిగెడితే తప్ప వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. బళ్లారి చౌరస్తా సర్కిల్ నుంచి వివిధ మార్గాలకు పెద్ద ఎత్తున వేలాది వాహనాలు వచ్చి వెళ్తుండటమే ప్రధాన సమస్యగా మారింది. ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసినా ట్రాఫిక్ సమస్య తీరడం లేదు. హైదరాబాదు, బెంగళూరు, బళ్లారి నుంచి కర్నూలు నగరంలోకి ప్రవేశించే వాహనాలు, నగరంలో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. నిలిచిపోయిన వాహనాలను దాటుకుని ముందుకు వెళ్లేందుకు నడక మార్గాన వెళ్తున్న ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. బళ్లారి చౌరస్తాలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోకుండా ఉండాలంటే ప్రధాన మార్గాలను వెడల్పు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు



ఉదయం, సాయంత్రం అయితే బళ్లారి చౌరస్తా వద్ద విపరీతంగా రద్దీగా మారుతోంది. హైదరాబాద్, ఆదోని, ఎమ్మిగనూరు నుంచి వచ్చే వాహనాలు అధికంగా ఉండడంతో గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో బస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా వరకు వెళ్లేందుకు సుమారు అరగంట సమయం పడుతోంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి

- శ్రీను, కర్నూలు

ట్రాఫిక్ రద్దీని నివారించండి

నేను ప్రతి రోజు కల్లూరు ఎస్టేట్ కాలనీ నుంచి కోడుమూరు మండలం పులకుర్తి హైస్కూల్‌కు వెళ్లాలి. రహదారి మధ్య చౌరస్తాలో వాహనాల రద్దీ వల్ల రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు అక్కడ పోలీసులు అష్టావధానం చేస్తున్న పరిస్థితి ఉంది. వాహనాలు అడ్డదిడ్డంగా వస్తుండటంతో ఎక్కడ పడితే నిలిచిపోతున్నాయి. రోడ్లను వెడల్పు చేస్తే చాలా వరకు సమస్య తీరుతుంది.

- పీవీ ప్రసాద్, హెచ్‌ఎం

బీసీల సమస్యలు పరిష్కరించాలి

● ఎంపీని కోరిన బీసీ జేఏసీ నాయకులు



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న బీసీ నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యలు పరిష్కరించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బత్తుల లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజును దేవపూజ ధనుంజయ్ ఆచారితో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నగరంలో బీసీ భవనాన్ని నిర్మించి, బీసీల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బత్తుల సంజీవరాయుడు, అయ్యన్న యాదవ్, వడ్డే లక్ష్మన్న, మిద్దె శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం సూచించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో 104 ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర నాయకులు యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ 104 ఉద్యోగులను పీహెచ్‌సీలో విలీనం చేయాలన్నారు. జీవో నెంబరు 7 అమలు చేసి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలన్నారు. సమవేశంలో సంఘం అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు చంద్రహాస్, హరిమోహన్, వినోద్‌కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాసు జయంతి నిర్వహించాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతిని ప్రభుత్వం అధికారికంగా కర్నూలులో నిర్వహించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను కలిసి కర్నూలు జిల్లా కురువ సంఘం నాయకులు పెనుగొండలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. కర్నూలు జిల్లా కురువ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, కేసీ నాగన్న పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మున్సిపల్ మెయిన్ హై స్కూల్‌లో శిక్షణ పొందే సీలంబం క్రీడాకారులకు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నవంబరు 10న గుంటూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి సిలంబమ్ చాంపియన్‌షిప్‌లో విజేతలుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో కోచ్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో కమిషనర్ విస్తృత పర్యటన

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదివారం పలు ప్రాంతాల్లో విస్తృతంగా ర్యటించారు. మునగాలపాడులోని 15 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. స్థానిక వై. జంక్షన్ కూడలి, పార్థసారథి నగర్, ఎస్‌ఏపీ క్యాంపు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో కాలనీ సమస్యలపై చర్చించారు.

● నగర పాలక సంస్థకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ప్రజలను కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం తెలిపారు.

ప్రజా ఉద్యమాల సారథి సీపీఐ

● రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ సత్యనారాయణ మూర్తి



మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

ఓర్వకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నిరంతరం ప్రజా ఉద్యమాల సారథి సీపీఐ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం ఓర్వకల్లు గ్రామ సమీపాన గల ఏరో-1 హోటల్‌లో కర్నూలు నగర సీపీఐ రాజకీయ సిద్ధాంతిక శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 1925 డిసెంబరు 6న భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో పురుడు పోసుకుని సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానించిన ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. దేశ సంపదను ప్రజలకు తిరిగి పంపిణీ చేయడం కోసం సీపీఐ ఉద్యమాలను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ దర్శి సంఘం సభ్యులు రామచంద్రయ్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, మండల కార్యదర్శి ఆవుల రమేష్, నగర కార్యవర్గ సభ్యులు గిడ్డమ్మ, మల్లన్న, బీసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి



కర్నూలు మార్కెట్ యార్డులో ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాతో పాటు పక్క జిల్లాలు, రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉల్లి రైతులు కర్నూలు మార్కెట్‌యార్డుకు పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులు తీసుకువస్తున్నారని, అయితే వివిధ కారణాల వల్ల వారికి గిట్టుబాటు ధర అందడం లేదని, వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఆదివారం రైతులకు మద్దతుగా కర్నూలు మార్కెట్ యార్డులో సెక్రటరీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ నవ్య కనీసం వారానికి ఒకసారి కర్నూలు మార్కెట్ యార్డుపై సమీక్ష నిర్వహించి అకస్మిక తనిఖీలు చేపడితేనే రైతులకు గిట్టుబాటు ధర అందుతుందని అన్నారు. వేల టన్నుల ఉల్లి యార్డులోనే నిలిచిపోయి రైతులు తీవ్ర కష్టనష్టాలకు గురవుతున్నారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, పంచలింగాల మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలకు ప్రోత్సాహకాలు అందిస్తాం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రంలో నాటక ప్రదర్శనలకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి ప్రతి నెలా చివరి ఆదివారం ప్రదర్శించే నాటక ప్రదర్శనల్లో భాగంగా, గుంటూరు నగరానికి చెందిన ఆరాధన ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ కళాకారులతో ఆకురాతి భాస్కర చంద్ర రాసిన 'మరీ...అంతొద్దు' హాస్య నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పత్తి ఓబులయ్య కళాసంస్థ నిర్వాహకులను ఘనంగా సత్కరించి, రూ.20వేలు పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం కళాప్రదర్శనలతో కళాక్షేత్రం అలరాలుతుండాలని కళాక్షేత్రం ఛైర్మన్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఆదేశాల మేరకు ప్రతి నెలా పౌరాణిక, సాంఘిక నాటకాలను ఆహ్వానించి ప్రదర్శనలు ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈ నాటిక ప్రదర్శనకు ముందు టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారులు, కూచిపూడి నృత్య గురువు ఎస్ కరీముల్లా ఆధ్వర్యంలో నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, సభ్యులు ఇనాయతుల్లా, యాగంటీశ్వరప్ప, కే బలవెంకటేశ్వర్లు, కన్వీనర్ కే లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.

మౌలానా జుబేర్ అహ్మద్ ఖాన్ మృతి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ముస్లిం ధార్మికవేత్త, ఆధ్యాత్మిక ప్రబోధకుడు మౌలానా జుబేర్ అహ్మద్ ఖాన్ రషాది (68) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం కర్నూలులో నిర్వహించారు. ఆయన తబ్లీక్ జమాత్ సంస్థ సభ్యుడిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో చెకుముకి



మాట్లాడుతున్న డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు ఆదివారం మాంటిస్సోరి హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక సుధీర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో శ్యామూల్ పాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు కలిగి ఉండాలని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలకు విద్యాశాఖ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కన్వీనర్ డా.సురేష్, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఖాజా హుశేన్, సాహితి స్రవంతి రాష్ట్ర నాయకులు రఘుబాబు, సమతా కన్వీనర్ రమాదేవి, జన విజ్ఞాన వేదిక నాయకులు శంకరయ్య, రుద్రమణి, ఆజాద్, వెంకటేశ్; ఆర్యన్, సాయి, అబ్దుల్లా ఆల్తాఫ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆర్‌యూ క్రీడా పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సెయింట్‌జోసెఫ్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఆర్‌యూ పరిధిలోని డిగ్రీ కళాశాలల క్రీడా పోటీలు జరిగాయి. కళాశాల డీన్ పరిపాలనాధికారి శౌరీలు రెడ్డి విజేతలకు కప్ అందజేశారు.

విజేతలు:

● **సెపక్‌తక్రా విజేత ఆదోని:** సెపక్‌తక్రా క్రీడలో ఆదోని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రన్నర్ సెయింట్ జోసెఫ్ జట్టు.

● చదరంగంలో రాయలసీమ యూనివర్సిటీ కర్నూలు విజేతగ నిలిచారు.

● వాలీబాల్‌లో రామకృష్ణారెడ్డి కళాశాల నంద్యాల విన్నర్, రన్నర్ రాయలసీమ యూనివర్సిటీ కర్నూలు.. తృతీయ స్థానం ప్రభుత్వ కళాశాల పత్తికొండ నిలిచింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.శాంత, ఆర్‌యు క్రీడల సమన్వయకర్త డా. శివకిషోర్, పీడీ వెంకటేశ్వర్లు, మూర్తయ్య వైస్ ప్రిన్సిపాల్ వెంకట్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. ఆదివారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్‌ను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, నంద్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల సుబ్బన్న, ఆయా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

● జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్‌ను ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సహకారంతో ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని డీఈవో తెలిపారని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామకృష్ణయ్య, తిమ్మప్ప, యోగేంద్ర బాబు, రామగోపాల్ రెడ్డి, హబీబుల్లా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● డీఈవోను ఆదివారం జిల్లా ఆప్టా నాయకులు కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్టా ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు, ఆప్టా జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి మహ్మద్‌రఫీ, జిల్లా సలహాదారు జగదీష్ పాల్గొన్నారు.

పొగాకు సాగు.. భలే బాగు

● క్వింటం రూ.15 వేలు
● మండలంలో పెరిగిన విస్తీర్ణం



కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 27: పొగాకు సాగు పట్ల రైతులు గతంలో మొగ్గు చూపేవారు కాదు. అయితే రెండేళ్ల నుంచి పొగాకు విస్తీర్ణం బాగా పెరిగింది. మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో రైతులు అత్యధికంగా సాగు చేశారు. మండలంలోని గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ, ప్యాలకుర్తి, కొత్తూరు, క్రిష్ణాపురం, ముడుమలగుర్తి తదితర గ్రామాల్లో పొగాకు పంటను సాగు చేశారు. మండలంలో గతేడాది పొగాకు సాగు 225 హెక్టార్లు కాగా ప్రస్తుతం అది 870 హెక్టార్లకు చేరింది. నాటు వేసుకున్న రెండు నెలల అనంతరం ఆకులు కోత కోసి ధారానికి కట్టి ఆరబెడతారు. అవి బాగా ఎండిన తర్వాత విక్రయిస్తారు. ఈవిధంగా పొగాకు సాగులో ఎకరాకు రూ. 50 వేల దాకా పెట్టుబడి అవుతుంది. వర్షాలు అనుకూలిస్తే కాండం బాగా పెరిగి ఆకులు ఎక్కువగా వస్తాయి. నాటు వేసిన ఆరంభంలో మిడత అనంతరం ఆకులను ఆశించే లద్దెపురుగు నివారణకు చర్యలు తీసుకుంటే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. గతేడాది క్వింటం రూ. 15 వేలు విక్రయించారు.



● పది ఎకరాల్లో సాగు చేశా



గతేడాది ఆరు ఎకరాలు కౌలు తీసుకుని పొగాకు పంట చేశా. ఎకరాకు 6 క్వింటాళ్ల చొప్పున దిగుబడి అందింది. క్వింటం రూ. 15 వేలు చొప్పున విక్రయించాను. ఈ ఏడాది పది ఎకరాల్లో పంట వేశాను. వర్షాలు అనుకూలించడంతో పంట ఏపుగా పెరిగింది.

- గిడ్డయ్య, కౌలురైతు, గోరంట్ల

ఇదే మొదటిసారి



ఎకరాలో పొగాకు పంట వేశాను. పొగాకు సాగు చేయడం ఇదే మొదటిసారి. పొగాకు సాగుతో గతేడాది రైతులు మంచి లాభాలు ఆర్జించారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించాయి. దీంతో పంట బాగుండడంతో పాటు ధర కూడా ఉండడంతో ఆదాయం వస్తుందని ఆశిస్తున్నా.

- బంకు గిడ్డయ్య, అనుగొండ

చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి

ఓర్వకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వాణిజ్య విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మనపల్లె గ్రామంలో ఎమ్మెల్యే గౌరు చరిత సహకారంతో గ్రీన్ కో సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎక్సవేటర్‌తో కంప చెట్ల ను తొలగించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ గత 10ఏళ్లుగా గ్రామంలో రోడ్ల వెంట కంప చెట్లు, మురికి నీరుతో పాటు కాలువలు, శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ముళ్లపొదలను, పూడికను తొలగించామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామ నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్ చౌదరి, రామాంజనేయులు, సంజీవ, ఎల్లసుబ్బయ్య పాల్గొన్నారు.

అడుగడుగునా అవస్థలే..



పెంచికలపాడు సమీపంలో బ్రిడ్జిపై గుంతలమయంగా రహదారి

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా గుంతలు పడడంతో ప్రజలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు - పెంచికలపాడు రహదారి గుంతలమయంగా మారింది. గూడూరు నుంచి వయా పెంచికలపాడు మీదుగా కర్నూలు వెళ్లాలంటే 30 కి.మీ. ప్రయాణించాలి. రహదారి గుంతలు పడి అధ్వానస్థితికి చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గూడూరులోని పెట్రోలు బంకు సమీపంలో మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి గుంతలు కనపడకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే పెంచికలపాడు సమీపంలో బ్రిడ్జి ఇనుప కడ్డీలు బయటకు వచ్చాయి. అలాగే ఆర్.కానాపురం, పొన్నకల్లు, మునుగాల, మల్లాపురం గ్రామాల్లో కూడా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

రహదారిని బాగు చేయండి

గూడూరు నుంచి పెంచికలపాడు మీదుగా కర్నూలు వెళ్లే రహదారిని బాగు చేయాలి. ఈ రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- జె. మోహన్, సీపీఎం మండల కార్యదర్శి, గూడూరు



గూడూరు సమీపంలో రహదారిపై గుంతలు

ఐకమత్యంగా ఉద్యమించాలి : యూటీఎఫ్



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ఉద్యమించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప సహాధ్యక్షురాలు జీవిత అన్నారు. ఆదివారం స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా సమావేశం నిర్వహించారు. బకాయిలు రూ.20వేల కోట్లు చెల్లించాలని, పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాగేంద్ర, సుజాత, రాముడు, రామాంజినే యులు, కళ్యాణి, హుస్సేనీ, జనార్దన్, ఉరుకుందయ్య, సిద్దప్ప, రేణుకాబాయి అరుణ జ్యోతి, రుద్రముని పాల్గొన్నారు.

శనగ విత్తనాలు మళ్లీ ఇవ్వాలి

మద్దికెర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధిక వర్షాలతో నల్లరేగడి ప్రాంతంలో సాగు చేసిన శనగ విత్తనాలు మొలకెత్తలేదని, నష్టపోయిన రైతులకు 50 శాతం రాయితీతో మళ్లీ శనగ విత్తనాలు ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మద్దికెర బురుజుల, అగ్రహారం గ్రామాల్లో దాదాపు 12 వేల హెక్టార్లలో శనగ విత్తనం వేసినా ఇంతవరకు మొలకెత్తలేదన్నారు. మదనంతపురం హనుమన్న, కోదండరాముడు పాల్గొన్నారు.

వంతెన నిర్మించండి

- రోడ్డుపై నీరు.. తరచూ వాహనదారులకు ప్రమాదాలు

తుగ్గలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునుసరాళ్ల - బొంది మడుగుల గ్రామాల మధ్య హంద్రీనీవా నీరు రహదారిపై పారుతోంది. దీంతో ప్రమాదాలు తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నీటిని గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటివరకు ఎంతోమంది గాయపడ్డారని కొన్నేళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి వేసి వదిలేస్తున్నారని, వంతెన నిర్మించాలని కోరుతున్నారు.




నునుసరాళ్ల వద్ద రహదారిపై పారుతున్న నీరు

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఆలూరు ఎక్సైజ్ పరిధిలోని హోళగుంద మండలం హెబ్బటం సమీపంలో భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణ ఆదివారం తెలిపారు. ప్రొహిబిషన్ కమిషనర్ హనుమంతరావ్ ఆదేశాల మేరకు దాడులు చేశామని బొలోరేలో తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ హోళగుందకు చెందిన ముల్లా తాప్, ముత్తప్ప, ఆదోనికి చెందిన రాఘవేంద్రను అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.1.30లక్షలు ఉంటుందని తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

మండలంలోని కమ్మరచేడు గ్రామంలో సమాచారం మేరకు దాడులు నిర్వహించి, 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు.రూ.21,565, రెండు బైకులు, 3 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.



శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ నం.72
ఫ్లవర్ బజార్,ఆదోని - 518301, కర్నూలు జిల్లా.
(Regd. Under APMACS Act, 1995) RBI Licence No. UBD, AP. 1671P, email id : ho@avvabank.com

Ref.No.SMLC.BANK;ADN;2024-25
MTL 200230141002234

స్వాధీనతా ప్రకటన (లాంఛనప్రాయం మాత్రమే) (రూలు - 8(1))

దిగువ విధంగా

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఆదోని, అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుచే **Ref.No.SMLC.BANK;ADN;2024-2025, తేది:14.08.2024** తేదీగల డిమాండ్ ప్రకటన జారీ చేయబడినదని **రుణగ్రహీత : వడ్డె నర్సింహులు తండ్రి వడ్డె కాంబయ్య, డి.నం.17/253, కల్లుబావి, ఆదోని** వారిని సదరు ప్రకటన స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న విధంగా తిరిగి చెల్లించాల్సిన బకాయి మొత్తం (14.08.2024 నుండి చార్జ్ చేయబడిన / చెల్లించాల్సిన వడ్డీ మరియు ఇతర చార్జీలు) 14.08.2024 వరకు **రూ.3,20,011/- (రూపాయలు మూడు లక్షల ఇరవై వేల పదకొండు మాత్రమే). 22.10.2024** నాటికి డెబిట్ బ్యాలన్స్ మొత్తం **రూ.2,76,754/- (రూపాయలు రెండు లక్షల డెబ్బైఆరు వేల ఏడు వందల యాభై నాలుగు మాత్రమే)** ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను & హామీదారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా **రూ.2,76,754/- (రూపాయలు రెండు లక్షల డెబ్బైఆరు వేల ఏడు వందల యాభై నాలుగు మాత్రమే)**మరియు (22.10.2024 నుండి చార్జ్ చేసిన / చెల్లించాల్సిన వడ్డీ మరియు ఇతర చార్జీలు) శ్రీ మహాలక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని చార్జ్‌కు చెల్లించుటకు లోబడియుంటాయి.

షెడ్యూల్ సి :

ఆస్తి వివరణ : (దాక్యుమెంట్ నం.466 ఆఫ్ 1991)
కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ జిల్లాలో మరియు ఆదోని, కల్లుబావి వద్దగల సర్వే నం.389, డి.నం.17/254తో ఇంటి ఆస్తి యావత్తు.
సరిహద్దులు : తూర్పు: రాస్తా, **పశ్చిమం:** ఉప్పర అల్లప్ప ఇల్లు, **ఉత్తరం :** వీరభద్రప్ప గుడిశ, **దక్షిణం:** నర్సప్ప ఇల్లు.
కొలతలు: సైట్ కొలతలు: భాగం 1 : తూర్పు-పశ్చిమం: 15 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 10.9 అడుగులు, **విస్తీర్ణం: 163.50** చ.అడుగులు.
భాగం 2 : తూర్పు-పశ్చిమం: 8.5 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 10.9 అడుగులు, **విస్తీర్ణం : 92.65 చ.అడుగులు. మొత్తం విస్తీర్ణం: 256.15 చ.అడుగులు.**
ప్లింత్ విస్తీర్ణం : గ్రౌండ్ ఫ్లోర్ : తూర్పు-పశ్చిమం: 23.6, ఉత్తరం-దక్షిణం: 10.9, విస్తీర్ణం: 257.24 చ.అడుగులు.
మొదటి అంతస్తు : తూర్పు-పశ్చిమం: 17.9 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 10.9, **విస్తీర్ణం : 195.11** చ.అడుగులు.
మొత్తం ప్లింత్ ఏరియా : 452.34 చ.అడుగులు

తేదీ : 22-10-2024 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం, ఆదోని. — శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్.

కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు



ఆదోనిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు



మద్దికెర: సభ్యత్వంలో టీడీపీ నాయకులు

ఆదోని, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ముందస్తు ప్రణాళికలతో రంగంలోకి దిగారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తొలిరోజే సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. చాలా మంది కార్యకర్తలు సెల్‌ఫోన్‌ల నుంచి స్వచ్ఛందంగా నమోదు చేసుకుని పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. ఆదోని వాల్మీకి నగర్, చిన్న శక్తిగుడి ఏరియాల్లో టీడీపీ సభ్యత్వం నమోదు ప్రారంభించారు. ఉమాపతి నాయుడు, కౌన్సిలర్ పార్వతి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, సాకేరే మారుతి రావు పాల్గొన్నారు. కార్యకర్తలను కాపాడుకోవడం చంద్రబాబు బాధ్యత అన్నారు. నియోజకవర్గం నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడుతో పాటు, నాయకులు పార్టీకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు. వాల్మీకి వెంకటేష్, బాబు, ఈరన్న, లక్ష్మణ, వెంకటేష్, జయరాం, నాగేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోండి

మద్దికెర: కార్యకర్తలు సభ్యత్వం తీసుకుంటే కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఉప సర్పంచ్ బసినేపల్లి తిమ్మప్ప, హరినాథ్‌గౌడ్, దేవేంద్ర అన్నారు. ఆదివారం బసినేపల్లి గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. మదనంతపురం శ్రీనివాసులు, సంజప్ప తదితరులు ఉన్నారు.

జోరుగా తుగ్గలిలో టీడీపీ సభ్యత్వ నమోదు


తుగ్గలి: మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు ఊపందుకుందని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, దేవదాస్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నునుసురాళ్ల, నల్లగుండ్లలో టీడీపీ సభ్యత్వ నమోదు చేశారు. మహేష్‌గౌడు, రామాంజనేయులు, నల్లగుండ్ల రవి, మునేశ్వర్‌గౌడు పాల్గొన్నారు

గుండ్లకొండ వద్ద సబ్ కెనాల్ నిర్మించాలి



ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ ,అక్టోబరు 27 : గుండ్లకొండ వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పి.కోటకొండ వరకు సబ్ కెనాల్‌ను నిర్మించాలని కర్నూలు ఎంపీ నాగరాజుకు టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని సగం గ్రామాలకే మాత్రామే హంద్రీనీవా నీరు వస్తుందని, గుండ్లకొండ వద్ద సబ్ కెనాల్ ఏర్పాటు చేస్తే గుడిమిరాళ్ల ,బంటుపల్లి, బేతపల్లి, చెల్లెలచెలిమల, పి.కోలకొండ వరకు నీరు అందుతుందని అన్నారు. నాయకులు వెంకటస్వామిగౌడ్ అన్నారు. కార్యక్రమంలో పరమేష్‌గౌడ్, శ్రీనివాసులు గౌడ్ ఉన్నారు.







యూటీఎఫ్ నూతన కమిటీ

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ యూటీఎఫ్ కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా సునీల్ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్ రావు, గౌరవాధ్యక్షుడిగా ఓబేదుర్ రెహమాన్, గౌరవ సలహాదారులుగా ఫయాజ్, గిరిబాబు, కోశాధికారిగా మురారి మహేష్, ఉపాధ్యక్షురాలిగా శకుంతల, నగేష్, జిల్లా కౌన్సిలర్స్‌గా మల్లికార్జున, రాహుల్, సీపీఎస్ కన్వీనర్‌గా సాదిక్‌ను ఎన్నుకున్నారు. మున్సిపల్ పదోన్నతులు కల్పించి బదిలీలను చేపట్టాలని , ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



సునీల్, జగన్‌మోహన్

5న కర్నూలుకు రండి

వెల్దుర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై ప్రభుత్వాలను ఒత్తిడి చేసేందుకు నవంబరు 5న కర్నూలుకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ అన్నారు. మందకృష్ణ మాదిగ రానున్నారని తెలిపారు. దేవదానం, గిడ్డయ్య, ఎర్రబజారు, ఐజయ్య, హరి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ఆదోని టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులు విమానంలో ఇరుముడితో ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించడంపై మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మాట్లాడుతూ, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఇరుముడితో ప్రయాణించేదుకు అవకాశం కల్పించడంతో దూర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి నాయకులు ఇలాంటి ప్రయోజనకర నిర్ణయాలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.



ప్రభుత్వ కార్యాలయాల్లో బసవేశ్వరుడి ఫొటో పెట్టాలి

తుగ్గలి అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బసవేశ్వరుని ఫొటోను ఏర్పాటు చేయాలని టీడీపీ వీరశైవ లింగాయత్ సాధికార కమిటి రాష్ట్ర సభ్యుడు బాదడ కౌశిక్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ 12వ శతాబ్దంలో కవి, తత్వవేత్తగా లింగాయత్ సాంప్ర దాయాన్ని స్థాపించిన బసవేశ్వరుని ఫొటోలు ఏర్పాటు చేసి గుర్తింపు ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి మండల కేంద్రాల్లోని కూడళ్ల వద్ద బసవేశ్వరుని విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. బసవేశ్వరుని జయంతిని సెలవుదినంగా ప్రకటించి అధికారికంగా బసవ జయంతి నిర్వహించాలన్నారు. కర్నాటక, మహారాష్ట్రలో బసవేశ్వరుని జయంతి ఘనంగా నిర్వహిస్తారనీ, మన రాష్ట్రంలో కూడా చేయాలని కోరారు. కుల, వర్గ, లింగవివక్ష వ్యతిరేకించి పోరాడిన విశ్వగురువు బసవేశ్వరుడు అని పేర్కొన్నారు.



కౌశిక్ కుమార్





వాహనాల పత్రాలు తప్పనిసరి



ముగతిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

నందవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముగతి- మంత్రాలయం రోడ్డు సర్కిల్‌లో ఆదివారం రాత్రి ఎస్ఐ శ్రీనివాసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహనాలు ఆపి లైసెన్స్‌లను, రికార్డులను పరిశీలించారు. పలువురికి జరిమానా విధించారు. వాహనాలు నడిపేతప్పుడు అన్ని రికార్డులు ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహదారులు హెల్మెట్ తప్పని సరిగా వాడాలని సూచించారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన పెద్దగిడ్డయ్య, చిన్నగిడ్డయ్యలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గోవిందు అనే వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అరకిలో వెండి కిరీటం చోరీ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలో ఎర్రకోట గ్రామంలోని దేవాలయంలో ఆదివారం అర కిలో వెండి కిరీటం చోరీ అయింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో వెలసిన మహాలింగేశ్వరస్వామి దేవాలయంలో దేవుడి తలపై ఉన్న వెండి కిరిటాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. సంఘటనపై ఆలయ సిబ్బంది, గ్రామస్థులు స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సాగునీటి పథకాలకు మరమ్మతులు చేపట్టండి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో గురు రాఘవేంద్ర పంప్ హౌస్ (జీఆర్పీ)లో మరమ్మతులు చేసి వెంటనే రైతులకు సాగునీరు అందించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం గురురాఘవేంద్రప్రాజెక్టు కింద ఉన్న రాంపురం, మాధవరం ఎత్తిపోతల పంప్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవరం బసలదొడ్డి ఎత్తిపోతల పథకాలు ధ్వంసానికి గురై మూడు నెలలు కావస్తున్నా మరమ్మతులు చేయించకపోవడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దీంతో రైతులు సాగునీరు అందక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు నీరు అందజేస్తామని చెప్పి.. ఇప్పటి వరకు సాగునీరు అందించలేకపోయారని వాపోయారు. 10వేల ఎకరాలకు సాగునీరు అందించే పంప్‌హౌస్ ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. పంప్‌హౌస్‌లకు మరమ్మతులు చేయించకపోతే కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న, పరమేష్, గుణశేఖర్‌బాబు, జయరాజు, వీరేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, సురేష్, ఏలిషాలు పాల్గొన్నారు.



జీఆర్పీ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పోరాటాలకు సిద్ధం కావాలి: సీపీఎం

ఎమ్మిగనూరు , అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పద్మశాల కల్యాణమండపంలో సీపీఎం కర్నూలు జిల్లా మహాసభలు డిసెంబర్ 29,30 తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహించేందుకు గాను ఆహ్వానసంఘ సన్నాహక సమావేశాన్ని స్థానిక నాయకులు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా గోవిందు, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనరసయ్య, అబ్దుల్, రాముడు, ఆంథోని, ఆదెన్న, అడ్వకేట్ తిమ్మప్ప, కరుణాకర్, దేవపుత్ర, ప్రధానకార్యదర్శిగా హనుమంతు, కార్యదర్శులుగా కృష్ణ, రమేష్, తిమ్మన్న, ఎల్లేష్, దండు ఖాజా, దేవేంద్ర మూర్తి, సభ్యులుగా పరమేష్, నరసింహులు, రంగస్వామి, రాజు, వీరేంద్రలను ఎన్నుకున్నారు.

కూటమితోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

కౌతాళం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తమరెడ్డి అన్నారు. కౌతాళంలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందని, పేదల క్షేమం కోసం తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్షలు, దౌర్జన్యాలు, అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని ఆరోపించారు. దీంతో ఏపీలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గెలిచినా ప్రజలకు చేసిందేమిలేదన్నారు. ఇసుక, లిక్కర్ వ్యాపారాలతో అక్రమ భూముల కబ్జాలతో రౌడీలను పెంచి పోషించారని విమర్శించారు. నాయకుడు అనేవాడు ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. కానీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాత్రం అభివృద్ధిని మరిచి తన సొంత లాభాలను పెంచుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నబిసాబ్, కార్యదర్శి రామచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు పురుషోత్తమరెడ్డి

విద్యార్థుల అపూర్వ కలయిక

● సిల్వర్‌జూబ్లీ వేడుకలు జరుపుకొన్న విద్యార్థులు



మంత్రాలయంలో 25 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు

మంత్రాలయం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పాఠశాల ఆవరణంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా కేక్‌ను కట్ చేసి ప్రధానోపాధ్యాయులు సోమప్ప, గణితం ఉపాధ్యాయుడు విశ్వేశ్వరయ్య, సైన్స్ టీచర్ కేశవయ్య, డ్రిల్ మాస్టర్ ఇస్మాయిల్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విద్యాసాగర్, అశ్వత్‌నారాయణ రెడ్డి, శ్రీధర్ స్వామి, దేవేంద్ర, నాగరాజు, రాఘవేంద్ర, వాసుదేవేంద్రరావు, భీమన్నగౌడు, మేకల నరసింహులు, రఘునాత్, ప్రకాష్ రెడ్డి, రవికుమార్, పరిమళ, రూపాదేవి, పద్మావతి, రాధిక, సుభాషిణి, ధనలక్ష్మి, సుందరమ్మ, అనూసూయ, గోవిందనాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ఉపయోగం



మాచాపురంలో టీడీపీ సభ్యత్వాన్ని ఫోన్‌లో నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ఎంతో ఉపయోగమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్, మాచాపురం మాజీ సర్పంచ్ కాశీంవలీ అన్నారు. అదివారం మండలంలోని మాచాపురంలో టీడీపీ నాయకుడు వలీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకుంటే ప్రమాదశాత్తు ఏమైనా జరిగితే బీమా సౌకర్యం ఉంటుందన్నారు. పేదవిద్యార్థులకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్యను అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పీరసాబ్, వెంకట్రాముడు, పాల్గొన్నారు.

ఆలయానికి అరకిలో వెండి విరాళం

ఎమ్మిగనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో కోసిగి రోడ్డులో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన సుబ్రహ్మణ స్వామి జనరల్ స్టోర్స్ యజమాని అర కిలో వెండి విరాళం ఇచ్చారు. ఆదివారం జనరల్ స్టోర్స్ నిర్వాహకులు పసుపుల సన్నమ్మ, విజయ్ కుమార్, సూర్యనారాయణ, ప్రసన్న లక్ష్మి, శివ సాయి కుమార్, శశికళ కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి అలంకరణకు అరకిలో వెండిని విరాళంగా అర్చకునికి అందజేశారు. వీరిని అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయం నిర్వాహకులు గుమ్మల ప్రకాష్ పాల్గొన్నారు.



వెండి విరాళం ఇచ్చిన భక్తులను సన్మానిస్తున్న ఆలయ అర్చకుడు

వ్యక్తికి దేహశుద్ధి

ఎమ్మిగనూరు , అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... ఓ గ్రామానికి చెందిన భార్యాభర్తలు బస్టాండ్ వైపు నుంచి పట్టణంలోకి నడుస్తూ వస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె భర్త, స్థానికులు ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. బస్టాండ్ ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



వ్యక్తికి దేహశుద్ధి చేస్తున్న దృశ్యం

నేత్రాలను నిర్లక్ష్యం చేయొద్దు

ఎమ్మిగనూరు , అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): నేత్రాలను నిర్లక్ష్యం చేయొద్దని ప్రముఖ కంటివైద్య నిపుణులు డాక్టర్ ఆడిమి నాగవంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలో మార్కండేయ యూత్ ఆధ్వర్యంలో ఉచితకంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మార్కండేయ యూత్ సభ్యులు ఆడిమి నవీన్ కుమార్, కాకర్ల తరుణ్, ఆడిమి శ్రీనివాసులు, తాటికొండ హరిబాబులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అలరించిన దాసవాణి సాహిత్యం



కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

మంత్రాలయం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో కర్ణాటకలోని మంగళూరు చెందిన అశ్విజ, అనన్య, పవన్ కళాకారులచే నిర్వహించిన దాసవాణి సాహిత్యం భక్తులను అలరించింది. ఆదివారం ప్రవచన మండపంలో కార్తీకమాసం పురస్కరించుకుని భక్తి పాటలతో దాసవాణి సాహిత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. వీరికి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, మెమెంటో ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, పద్మనాభాచార్, హనుమేషాచార్, వ్యాసారాజాచార్‌లు పాల్గొన్నారు.